కాంగ్రెస్, బీజేపీని నమ్మితే ఆగమైపోతం

III తరువాయి...

మంత్రి కేటీఆర్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతున్నదని తెలిపారు. 'స్కూళ్లలో పొద్దున్నే టిఫిన్ ప్రారంభించాం. మధ్యాహ్నం సన్నబియ్యంతో భోజనం పెడుతున్నాం. పిల్లలు రాత్రికి ఇంటికి వచ్చిన తర్వాత సన్నబియ్యం బువ్వ తినేలా అన్నపూర్ణ పథకం కింద సన్నబియ్యం ఇవ్వబోతున్నాం. వండిపెట్టుడు, మూతి తుడుచుడు తప్ప అన్నీ ప్రభుత్వమే చేస్తున్నది' అని అన్నారు. 'బిడ్డ పుట్టినప్పుడు కేసీఆర్ కిట్ ఇస్తున్నాం. అనుకోకుండా ఎవరైనా మరణిస్తే కేసీఆర్ బీమా పథకం కింద రూ.5 లక్షలు ఇవ్వబోతున్నాం. పుట్టుక నుంచి చావుదాకా కేసీఆరే చూసుకోబోతున్నారు' అని పేర్కొన్నారు.

శుక్రవారం తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

హైదరాబాద్‌ను మంచిగ చేసుకున్నం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు హైదరాబాద్ అభివృద్ధిపై చాలా అనుమానాలు ఉండేవని, తొమ్మిదిన్నరేండ్ల తర్వాత హైదరాబాద్ ఇప్పుడు విశ్వనగరంగా ఎదుగుతున్నదని కేటీఆర్ అన్నారు. ప్రపంచంలోనే మంచి నగరంగా తీర్చిదిద్దే క్రమంలో అనేక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. 'సీఎం కేసీఆర్ పాలనలో కరెంటు మంచిగ చేసుకున్నం. గతంలో వారం పదిరోజులకు ఒకసారి నీళ్లు వచ్చేవి. ట్యాంకర్లు బుక్ చేసుకునే పరిస్థితి. ఖైరతాబాద్‌లో జలమండలి ముందు రోజూ ఖాళీ బిందెలతో ధర్నాలు అవుతుండే. ఇప్పుడు రెండు రోజులకు ఒకసారి నీళ్లు ఇచ్చుకుంటున్నం' అని గుర్తు చేశారు. గతంలో కరెంటు కోతలు విపరీతంగా ఉండేవని, ఇన్వర్టర్ లేని దుకాణం, జనరేటర్ల సౌండు, డీజిల్ కంపు కొట్టని అపార్ట్‌మెంట్లు ఉండేవి కావని తెలిపారు. ఇప్పుడు ఆ కష్టం లేదని చెప్పారు. హైదరాబాద్‌లో గొడవలు, కొట్లాటలు అవుతాయని భయపెట్టారని, కానీ తొమ్మిదిన్నరేండ్లలో చిన్న గొడవ గానీ, ఘర్షణ గానీ లేకుండా ఒక్క రోజు కర్ఫ్యూ పెట్టే అవకాశం లేకుండా శాంతి భద్రతలను కాపాడుతున్నామని పేర్కొన్నారు. 'హుస్సేన్‌సాగర్ వైపు వెళ్తే ఏదో కొత్త నగరానికి వచ్చినట్టు అనిపిస్తున్నది. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం, ఆయన పేరే పెట్టుకున్న నూతన సచివాలయం, అమరుల స్మూపం వంటి నిర్మాణాలతో ఆ ప్రాంతం అద్భుతంగా మారింది. హైదరాబాద్‌లో ఇప్పుడు రోడ్లు బాగయ్యాయి. మోరీలు, పార్కులు బాగు చేసుకుంటున్నాం. కమాండ్ కంట్రోల్ సెంటర్ వంటి కండ్లు చెదిరే నిర్మాణాలను చూస్తే అమెరికాను తలపిస్తున్నది. హైదరాబాద్‌లో ఇప్పుడు రెండు రోజులకు ఒకసారి నీళ్లు వస్తున్నాయి. భవిష్యత్తులో ప్రతిరోజు నీళ్లు ఇచ్చేలా, ఆ తర్వాతి దశలో ఎప్పుడు నల్లా తిప్పినా నీళ్లు వచ్చేలా 24 గంటల నీటి సరఫరా చేయాలని ప్రయత్నిస్తున్నాం' అని వెల్లడించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 70 కిలోమీటర్ల మేర మెట్రోలైన్ విస్తరించి ఉన్నదని, దీనిని 400 కిలోమీటర్లు చేయాలన్నది సీఎం కేసీఆర్ కల అని చెప్పారు.

కాంగ్రెస్, బీజేపీవాళ్లకే అర్థమైతలేదు

హైదరాబాద్ అభివృద్ధిని ఎంతో మంది పొగుడుతున్నా, ప్రతిపక్షాలకు అర్థం కావడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. సినీ హీరో రజినీకాంత్ ఇటీవల హైదరాబాద్‌కు వచ్చి.. 'జూబ్లీహిల్స్, గచ్చిబౌలి దిక్కుపోతే న్యూయార్క్‌లో ఉన్నట్టు అనిపిస్తున్నది' అని ప్రశంసించారని గుర్తు చేశారు. బీజేపీ ఎంపీ, సినీనటుడు సన్నీ డియోల్ 'హైదరాబాద్ ఎంతో అందంగా తయారయ్యింది. ఇక్కడే ఇల్లు కొనుక్కొని ఉండాలనిపిస్తున్నది' అని చెప్పిట్టు తెలిపారు. అమెరికాలో స్థిరపడ్డ నటి లయ ఇటీవలే హైదరాబాద్‌కు వచ్చి ఆశ్చర్యపోయారని, 'అమెరికాలోని పెద్దపెద్ద నగరాల కన్నా హైదరాబాదే బాగున్నది' అని అన్నారని గుర్తుచేశారు. 'సోషల్ మీడియాలో సుపరిచితురాలైన గంగవ్వ ఇటీవల దుబాయ్‌కి వెళ్లి వచ్చింది. ఆమె నన్ను కలిసినప్పుడు దుబాయ్ నగరం ఎలా ఉన్నదని అడిగిన. ఏమున్నది.. మన హైదరాబాద్ లెక్కనే ఉన్నది అని చెప్పింది. హైదరాబాద్ ఎంత అద్భుతంగా తయారైందో అందరికీ అర్థం అవుతున్నది. ఇక్కడే ఉన్న కాంగ్రెస్, బీజేపీ నేతలకు మాత్రం అర్థం కావడం లేదు' అని ఎద్దేవా చేశారు.

చిల్లర మాటలకు పడిపోతే ఆగమైతం

సీఎం కేసీఆర్ నాయకత్వంలో హైదరాబాద్ పెరుగుతున్నదని, ఇక్కడ పనిచేసుకునే కార్మికులు, ఉద్యోగులు చల్లగా ఉంటున్నామని, శాంతి సామరస్యాలతో కలిసి మెలిసి జీవిస్తున్నామని కేటీఆర్ అన్నారు. తొమ్మిదిన్నరేండ్లు అద్భుతంగా పాలన చేసిన సీఎం కేసీఆర్‌ను ఓడగొడతామని కొందరు వస్తున్నారని మండిపడ్డారు. 'ఎందుకు ఓడగొట్టాలె అని వచ్చిన వాళ్లను అడగండి' అని ప్రజలను కోరారు. 'మన జేబుల వంద రూపాయల నోటున్నది. మనం నడుచుకుంటా పోతుంటే రోడ్డుమీద చిల్లర పైసలు కనిపించినయి అనుకుందాం. వాటికోసం వంగితే.. జేబుల ఉన్న నోటు పడిపోతది. ఇక్కడ నోటేమో కేసీఆర్. చిల్లర పైసలు కాంగ్రెస్, బీజేపీ. నోటు జేబులో ఉన్నంత కాలం మనకు విలువ తెలువదు. మన దగ్గరనే ఉన్నది కదా అనుకుంటం. పోయినపుడే దాని విలువ తెలుస్తది. చిల్లర మాటలకు పడిపోతే ఆగమైతం. పెరుగుతున్న హైదరాబాద్ ఆగిపోతది. మల్లా కరెంటు కోతలు మొదలైతయ్. తాగునీటి గోస షురూ అయితది' అని హెచ్చరించారు.

పేదల కోసం కొత్త పథకాలు..

మ్యానిఫెస్టోలో సీఎం కేసీఆర్ ప్రకటించిన పథకాలను కేటీఆర్ వివరించారు.

అన్నపూర్ణ: 'తెలంగాణ ఏర్పడేనాటికి పేదలకు ఇచ్చే రేషన్ బియ్యం మీద సీలింగ్ ఉండేది. మనిషికి 5 కిలోల చొప్పున గరిష్ఠంగా ఇంటికి 20 కిలోలు మాత్రమే ఇచ్చేవారు. సీఎం కేసీఆర్ ఆ సీలింగ్‌ను ఎత్తివేయడమే కాకుండా మనిషికి 6 కిలోల చొప్పున బియ్యం ఇస్తున్నారు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంత బియ్యం వస్తున్నాయి. ఈ సారి గెలిచిన తర్వాత 'అన్నపూర్ణ' పథకం కింద తెల్లకార్డు ఉన్న ప్రతి ఇంటికీ నాణ్యమైన సన్నబియ్యం ఇస్తామని ప్రకటించారు' అని చెప్పారు.

రూ.400కే సిలిండర్: '2014 ఎన్నికల సమయంలో నరేంద్రమోదీ పెద్దపెద్ద మాటలు చెప్పిండు. సిలిండర్ ధర కొండెక్కిందని, ఆడబిడ్డలకు కట్టెల పొయ్యే దిక్కైతున్నదని, మీకు పాలన చేతనైతలేదని మన్మోహన్‌సింగ్‌ను తిట్టిండు. ప్రధాని అయ్యిండు. మోదీ పుణ్యమా అని ఆనాడు రూ.400 ఉన్న సిలిండర్ పదేండ్లలో రూ.వెయ్యికి చేరింది. గ్యాస్ బండ పేదలపాలిట గుదిబండగా తయారైంది. డిసెంబర్ 3వ తేదీన మూడోసారి అధికారంలోకి రాగానే.. మోదీ పెంచిన భారాన్ని నేనే కడుతానని, ఆడబిడ్డలకు రూ.400కే సిలిండర్ ఇస్తానని సీఎం కేసీఆర్ అంటున్నడు' అని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ గెలిస్తేనే అభివృద్ధి

సంపద పెంచాలె, పేదలకు పంచాలె, పేదలను కడుపులో పెట్టుకొని చూసుకోవాలనేదే కేసీఆర్ నినాదమని కేటీఆర్ చెప్పారు. 'ఛూమంతర్ అంటే పేదరికం మాయం కావాలని మాకు కూడా ఉంటది. కానీ సాధ్యం కాదు కదా! అందుకే పిండికొద్దీ రొట్టె అన్నట్టుగా ఎట్లెట్ల సంపద పెరిగితే దానికి తగ్గట్టు పథకాలు రూపొందిస్తున్నాం' అని పేర్కొన్నారు. అప్పుడే పుట్టిన పసిగుడ్డును కంటికి రెప్పలా కాపాడుకున్నట్టు సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని కాపాడుకుంటున్నారని చెప్పారు. మరోసారి బీఆర్ఎస్‌కే ఓటేసి మరింత అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డాక్టర్ దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పెంపు: 'ఆసరా పెన్షన్ ఇప్పుడు రూ.2 వేలు ఇస్తున్నాం. సీఎం కేసీఆర్ మళ్లీ గెలిచిన తర్వాత రూ.5 వేలు కాబోతున్నది' అని తెలిపారు.

సౌభాగ్య లక్ష్మి: 'ఆడబిడ్డలకు నెలకు రూ.3 వేల చొప్పున ఇచ్చే పథకాన్ని సీఎం కేసీఆర్ అమలు చేయబోతున్నారు. దీంతో ఇంట్లో అత్తకు రూ.5 వేలు పెన్షన్, కోడలుకు రూ.3 వేలు రాబోతున్నాయి' అని పేర్కొన్నారు.

లక్ష ఇండ్లు: 'హైదరాబాద్‌లో గత టర్మ్‌లో లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టినం. 70 వేలు పంపిణీ చేసినం. మూడో దఫాలో మరో లక్ష ఇండ్లు కట్టి పేదలకు ఇవ్వబోతున్నాం' అని వెల్లడించారు. ఇప్పటికే జీవో 58, 59 కింద క్రమబద్ధీకరించి పట్టాలు ఇచ్చామని, గృహలక్ష్మి కింద అర్హులైన వారికి ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు ఇస్తున్నామని గుర్తు చేశారు.

కేసీఆర్ బీమా: 'సీఎం కేసీఆర్ ఓసారి ఖమ్మం పోయినప్పుడు ఒక దళిత చెల్లెలు అడిగింది. అన్నా.. పొలం ఉన్నోళ్లకు రైతుబీమా ఇస్తున్నారు. మరి మాలాంటి పొలం లేనోళ్ల సంగతి ఏంది? అని. అప్పుడు మీ గురించి కూడా ఆలోచిస్తా అని సీఎం కేసీఆర్ చెప్పిండు. ఇప్పుడు కేసీఆర్ బీమా అనే పథకాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో తెల్లకార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా కల్పించబోతున్నాం' అని వివరించారు.

తెలంగాణ మొత్తం కుటుంబం.. పెద్ద కేసీఆర్: గోవర్ధన్

గతంలో జై తెలంగాణ అంటే జైలులో వేసేవారని, ఇప్పుడు గర్వంగా జై తెలంగాణ అని నినదించేలా చేసింది సీఎం కేసీఆర్ అని బీఆర్ఎస్‌లో చేరిన పల్లపు గోవర్ధన్ అన్నారు. 'ఇది మా భూమి.. మా రాష్ట్రం.. మేం గర్వంగా, సుఖంగా, సంతోషంగా ఉండగలుతున్నాం అని ప్రతి ఒక్కరూ చెప్పుకొనేలా చేశారు. చాలామంది సీఎం కేసీఆర్‌ను కుటుంబ పాలన అని విమర్శిస్తున్నారు. ఇతర పార్టీల్లో నేతలు ఏసీ రూముల్లో కూర్చొని మాట్లాడుతుంటే.. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు అటు పార్టీ పనులు, ఇటు ప్రభుత్వ పనులు, ఇప్పుడు ఎన్నికల పనులు చూసుకుంటున్నారు. తెలంగాణ ప్రజలంతా వాళ్ల కుటుంబం. వాళ్లు పడే కష్టమంతా ఆ కుటుంబాన్ని పాలించడం కోసమే. ఆ కుటుంబం తలెత్తుకొనేలా చేయడం కోసమే అహర్నిషలు కృషి చేస్తున్నారు' అని పేర్కొన్నారు. బీజేపీలో 22 ఏండ్లు పనిచేసినా తనకు ప్రాధాన్యం దక్కలేదని వాపోయారు.

మంత్రి కేటీఆర్‌కు తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న యునైటెడ్ ముస్లిం ఫోరం నేతలు

బీఆర్ఎస్‌కు ముస్లిం ఫోరం మద్దతు

- మంత్రి కేటీఆర్‌ను కలిసి ప్రకటించిన ఫోరం ప్రతినిధులు
- అభివృద్ధే మతంగా తెలంగాణ దూసుకెళ్తున్నది
- గంగా జమున తెహజీబ్ సంస్కృతికి నిలయం
- మంత్రి కేటీఆర్ వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ) : మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కొరకు పాటుపడుతున్న భారత రాష్ట్రసమితి (బీఆర్ఎస్)కి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని యునైటెడ్ ముస్లిం ఫోరం తెలిపింది. శుక్రవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి తమ మద్దతును ప్రకటించింది. తెలంగాణ ఏర్పడ్డాక మైనార్టీల స్థితిగతుల్లో గుణాత్మకమైన మార్పు వచ్చిందని, ఇందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలే కారణమని ఫోరం ప్రతినిధులు తెలిపారు. ముఖ్యంగా, మైనార్టీ గురుకులాల వల్ల అద్భుతమైన భవిష్యత్తు కలిగిన మైనార్టీ యువత తయారవుతున్న విషయాన్ని ప్రస్తావించారు. పేద కుటుంబాల్లోని ముస్లిం యువతులకు షాదీ ముబారక్ అందిస్తూ వారికి ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని కొనియాడారు.

అభివృద్ధి ఫలాలు అందరికీ సమానం : మంత్రి కేటీఆర్

యునైటెడ్ ఫోరం ప్రతినిధులను ఉద్దేశించి మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. కులాలు, మతాలు, ప్రాంతాలకతీతంగా అందరికీ అభివృద్ధి ఫలాలు సమానంగా అందాలన్న ఒక ఉదాత్తమైన లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కరువు లేదు, కర్ఫ్యూ లేదు అని తెలంగాణ మొత్తం గంగ జమున తెహజీబ్ సంస్కృతి వర్ధిల్లుతుందని తెలిపారు. పదేండ్లుగా ఎలాంటి మత ఘర్షణలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో అభివృద్ధే మతంగా తెలంగాణ ముందుకు పోతున్నదని చెప్పారు. బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు తెలిపిన యునైటెడ్ ముస్లిం ఫోరం ప్రతినిధులకు మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మైనార్టీల సంక్షేమానికి మరిన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి కేటీఆర్‌కు ఫోరం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో ఫోరం ప్రతినిధులు మౌలానా అక్బర్ నిజాముద్దీన్, మౌలానా జియావుద్దీన్ నయ్యర్, సయ్యద్ మసూద్ హుస్సేన్, సయ్యద్ జహీరుద్దీన్ అలీ సూఫీ, సయ్యద్ మునీరుద్దీన్ మక్తుర్, సుజుద్దీన్ ఇఫ్తీకర్, సయ్యద్ ఖాద్రీ, షఫి అలాం తదితరులు ఉన్నారు.

వేశ్యకు కూడా నీతి ఉంటుంది

సీపీఐ నారాయణ ట్వీటు

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌తో పొత్తు కుదరని కామ్రేడ్లు వేదాంత ధోరణికి దిగినట్టు తెలుస్తున్నది. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ గురువారం చేసిన రెండు ట్వీట్లు ఆ పార్టీ నిరాశా నిస్పృహలను వెల్లడిస్తున్నదని పరిశీలకులు పేర్కొంటున్నారు. 'నిశ్చితార్థం జరిగిన తరువాత వేరేవాళ్లు నచ్చారంటూ లగేస్కు వెళ్లడం నిజ జీవితంలో అక్కడక్కడా చూస్తుంటాం కానీ, రాజకీయాల్లో కుదరదు' అంటూ నారాయణ ట్వీట్ చేశారు. ''..వేశ్యకు కూడా ఒక నీతి ఉంటుంది స్వామి అని కన్యాశుల్కం నాటకంలో మధురవాణి చెబుతుంది.. మరి తాజా రాజకీయాలలో..???' అంటూ మరో ట్వీట్ చేశారు. జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో చేరిపోయిన కమ్యూనిస్టులు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్‌తో దోస్తీ చేయలేకపోయారు. సీపీఐ, సీపీఎం పార్టీల డిమాండ్లను.. కాంగ్రెస్ పట్టించుకోలేదు. దీంతో ఒంటరిగానే బరిలోకి దిగాలని నిర్ణయించుకున్న సీపీఎం ఇప్పటికే 17 మందితో తొలి జాబితాను ప్రకటించింది. సీపీఐకి కూడా మరో గత్యంతరం లేనప్పటికీ అధికారికంగా ఇంకా ఎటువంటి ప్రకటన చేయలేదు.

సూట్‌కేసుదే పైచేయి!

- కాంగ్రెస్‌లో టికెట్‌కో రేట్.. కొన్నవారికే రెడ్‌కార్పెట్
- కులం, సర్వే లేదు.. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ఊసేలేదు
- పైసలిస్తే పక్కా.. లేకుంటే పార్టీ జెండా మోసినా పక్కకే
- నాయకులు తలాకొన్ని సీట్లు పంచుకుని అమ్ముకున్నారు
- రేవంత్, ఉత్తమ్‌పై సొంతపార్టీ సీనియర్ల తీవ్ర విమర్శలు
- మూడోవంతు కాంగ్రెస్ టికెట్లు పారాచ్యూట్ నేతలకే..

> చాలామంది కాంగ్రెస్ నాయకులు పోటీపడుతున్నప్పటికీ, రాజకీయాలతో ఏమాత్రం సంబంధంలేని 26 ఏండ్ల యువతి యశస్వినికి కాంగ్రెస్ పాలకుర్తి టికెట్ కేటాయించింది. అక్కడ పౌరసత్వం దరఖాస్తు తిరస్కరణతో ఎన్నారై ఝాన్సీరెడ్డి ఎన్నికల్లో పోటీకి అవకాశం లేకుండా పోయింది. అలాంటప్పుడు మిగతా నేతలెవరికైనా కాంగ్రెస్ టికెట్ ఇస్తుందేమోనని అందరూ అనుకున్నారు. కానీ పార్టీతో, రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేని ఝాన్సీరెడ్డి మేనకోడలు యశస్వినికి కాంగ్రెస్ టికెట్ కేటాయించింది. పాలకుర్తి టికెట్‌ను ఎంతకు అమ్ముకుంటే, మిగతావారెవరూ లేరన్నట్టుగా 'అయితే అత్తకు.. లేదంటే కోడలికి..' అన్నట్టుగా పీసీసీ వ్యవహరించగలుగుతుంది?
>
> ..... ఓ కాంగ్రెస్ అసమ్మతి నేత మాట.

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): ఇప్పటివరకు విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలు రెండింటిని పరిశీలిస్తే కాంగ్రెస్ సాధారణంగా చెప్పే నీతిసూత్రాలు, నిబంధన వళిలాంటివి మచ్చుకైనా కనిపించవు. 40 ఏండ్ల అనుభవం ఉన్న సీనియర్ రాజకీయ వేత్త, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డిలాంటి వ్యక్తికి నాగర్‌కర్నూల్ టికెట్ దొరకదు. రాత్రికి రాత్రే పార్టీ మారిన వ్యక్తికి కోరుకున్నచోట టికెట్ దొరుకుతుంది. పార్టీని నమ్ముకుని పని చేసిన పాల్వాయి స్రవంతికి టికెట్ దొరకదు కానీ, మొన్నటి ఉపఎన్నికల ప్రత్యర్థి అయిన కోమటిరెడ్డికి కాంగ్రెస్‌లో చేరిన గంటల్లోనే టికెట్ వచ్చేస్తుంది. అందుకే పార్టీ జెండామోసినవారంతా ఇప్పుడు రగలిపోతున్నారు. పార్టీ కార్యక్రమాలనీ, జోడోయాత్ర అనీ ఇన్నాళ్లు తమతో డబ్బులు ఖర్చు పెట్టించి తీరా ఇప్పుడు టికెట్లు మాత్రం పక్కపార్టీల నుంచి వచ్చినోళ్లకు కేటాయిస్తున్నారని మండిపడుతున్నారు. డబ్బున్నవాళ్లకు టికెట్లు అమ్ముకొంటున్నారని మొదటినుంచీ వినిపిస్తున్న ఆరోపణలు, ఇప్పుడు నిజమయ్యాయని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. టికెట్లు ఎంతకు అమ్ముకున్నారో చెప్పాలని నిలదీస్తున్నారు. ఒక అడుగు ముందుకేసి.. 'ఇప్పుడే టికెట్లు అమ్ముకున్నోళ్లు, పొరపాటున అధికారంలోకి వస్తే రేపు రాష్ట్రాన్నీ అమ్మేయరా?' అని ప్రశ్నిస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే రెండో అభ్యర్థుల జాబితా విడుదలతో కాంగ్రెస్‌లో పెద్ద యుద్ధమే ప్రారంభమైంది. టికెట్లు రాని నేతలు రోడ్డెక్కి పార్టీపై తిరుగుబాటు బావుటా ఎగరేస్తున్నారు. నాయకుల నిరసనలతో గాంధీభవన్ రణరంగమవుతున్నది. రెండోజాబితా మొత్తం కాసులున్నోళ్లతో, గులాంగిరీ చేసేటోళ్లతోనే నిండిపోయిందని.. అసలైన కాంగ్రెస్ నేతలకు ఇందులో స్థానమే దక్కలేదని అసంతృప్త నాయకులు విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ సీట్ల కేటాయింపు అంతా పంచుకునుడు, అమ్ముకునుడు ఫార్ములాపైనే నడిచిందని వారు మండిపడుతున్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలిసి సీట్లను కూడా వాటాల్లా పంచుకున్నారని వారు ఆరోపిస్తున్నారు. మహేశ్వరం సీటు కోసం రేవంత్‌రెడ్డి రూ.10 కోట్లు, 5 ఎకరాల భూమి రాయించుకున్నారని ఆ పార్టీ నేత కొత్త మనోహర్‌రెడ్డి విలేకరుల సమావేశం పెట్టి మరీ ఆరోపించారు. కాంగ్రెస్‌లో డబ్బుకే ప్రాధాన్యం ఉన్నదని, పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపే లేదని మెదక్ డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి నిరసన స్వరం వినిపించారు. అమెరికా పర్యటనలో సీట్లు ఇప్పిస్తానని చెప్పి రేవంత్ రెడ్డి సుమారు 36 మంది నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు వినిపించాయి.

తలా కొన్ని సీట్లు

నిన్నటివరకు కాంగ్రెస్ సీట్లను డబ్బులకు అమ్ముకున్నారనే విమర్శలు రాగా.. తాజాగా కొందరు ఏఐసీసీ, పీసీసీ నేతలు తలాకొన్ని సీట్ల చొప్పున పంచుకున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ముఖ్యంగా రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వంటివారితోపాటు ఢిల్లీ నేతలు కొందరు ఎవరికి వారు తమ అనుచరులకు టికెట్లను పంచుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ రెండో జాబితాను పరిశీలిస్తే ఇదే స్పష్టమవుతుందని వారంటున్నారు. ఒక నియోజకవర్గంలో ఓ వ్యక్తిని రేవంత్‌రెడ్డి సపోర్ట్ చేస్తే.. మరో వ్యక్తిని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సపోర్ట్ చేసినట్లు వినిపిస్తున్నది. జనగామలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని రేవంత్ సపోర్ట్ చేయగా పొన్నాల లక్ష్యయ్యను ఉత్తమ్ సపోర్ట్ చేసినట్లు తెలిసింది. ఎల్లారెడ్డిలో మదన్‌మోహన్‌ను ఉత్తమ్ సపోర్ట్ చేయగా.. సుభాష్‌రెడ్డిని రేవంత్‌రెడ్డి సపోర్ట్ చేసినట్లు తెలిసింది. సూర్యాపేటలో దామోదర్‌రెడ్డిని ఉత్తమ్, పటేల్ రమేశ్‌రెడ్డిని రేవంత్‌రెడ్డి సపోర్ట్ చేస్తున్నట్లు తెలిసింది. నాగర్‌కర్నూల్‌లో కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డిని, కొల్లాపూర్‌లో జూపల్లిని, వనపర్తిలో మేఘారెడ్డిని, భువనగిరిలో కుంభం అనిల్ కుమార్‌రెడ్డిని, ఆదిలాబాద్‌లో కంది శ్రీనివాస్‌రెడ్డిని రేవంత్‌రెడ్డి సపోర్ట్ చేసినట్లు తెలిసింది. ఈ విధంగా చాలా చోట్ల ఎవరికి కావాల్సిన వారికి టికెట్లు ఇప్పించుకొని సీట్లను పంచేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సర్వే లేదు.. డిక్లరేషన్ లేదు

సర్వేల ప్రకారమే టికెట్లు ఇస్తామని, కొత్త నేతలకు ఎట్టి పరిస్థితుల్లోనూ టికెట్లు ఇచ్చే ప్రసక్తే లేదంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వరంగల్ సభలో ప్రగల్భాలు పలికారు. కానీ తీరా ఎన్నికలు వచ్చేసరికి మాట మార్చేశారు. సర్వేలతో సంబంధం లేకుండా టికెట్లను కేటాయించారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం పార్టీలో కనీసం ఐదేండ్లు పనిచేసిన వారికే టికెట్ ఇవ్వాలి, ఒకే కుటుంబానికి ఒకే టికెట్ ఇవ్వాలి. కానీ తాను పెట్టుకున్న ఈ రెండు నిబంధనలనూ కాంగ్రెస్ నాయకత్వమే పాటించలేదు. ఉదయం పార్టీలో చేరినవారికీ సాయంత్రం టికెట్ ఇచ్చారు. అసలైన కాంగ్రెస్ నేతలను పక్కనబెట్టి, పారాచ్యూట్ నేతలకు పెద్దపీట వేశారు. రెండు జాబితాల్లో కలిపి మొత్తం 30మంది జంప్ జిలానీలకు కాంగ్రెస్ టికెట్లు కేటాయించడం గమనార్హం. ముఖ్యంగా రాజగోపాల్‌రెడ్డి వంటి నేత ఉదయం పార్టీలో చేరితో సాయంత్రం జాబితాలో ఆయన పేరు ఉండడంపై పార్టీలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తమ్, మైనంపల్లి లాంటివారి కుటుంబంలో రెండేసి టికెట్లు కేటాయించడమూ నాయకుల్లో అసమ్మతిని మరింత రాజేసింది.

ఖర్చు పెట్టించారు.. మొండిచెయ్యి చూపారు

'రాహుల్ గాంధీ పాదయాత్రకు, సభలు, సమావేశాలకు ఖర్చు పెట్టుకోండి... ఎన్నికల్లో టికెట్ ఇప్పించే బాధ్యత నాది' అంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తమను నమ్మించి మోసం చేశారని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. రేవంత్‌రెడ్డి మాటలు నమ్మి కోట్లకు కోట్లు ఖర్చు చేస్తే తీరా... టికెట్ ఇవ్వకుండా మోసం చేశారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా పదుల సంఖ్యలో నేతలు ఉన్నట్లు సమాచారం. వికారాబాద్ జిల్లాకు చెందిన ఓ మహిళానేత రాహుల్‌గాంధీ యాత్రతోపాటు పలు సభలకు రూ. కోట్లలో ఖర్చు చేశారట. తీరా ఆమెకు తుది జాబితాలో సీటు దక్కకలేదు. మేడ్చల్ జిల్లాకు చెందిన మరో నేత కూడా రాహుల్ సభలకు భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేశారు. ఆయనకు కూడా సీటు దక్కలేదు. తీవ్ర అసంతృప్తితో ఇటీవలే పార్టీని వీడిన ఆ నేతతోపాటు మెదక్ జిల్లాకు చెందిన మరో సీనియర్ నేత కూడా భారీగా డబ్బు ఖర్చు చేసి మోసపోయారు. ఇలా రేవంత్ ఇచ్చిన టికెట్ హామీతో పెద్దమొత్తంలో డబ్బులు ఖర్చు చేసినవారెందరో ఉన్నారు. వారంతా ఇప్పుడు టికెట్ దక్కకపోవడంతో లబోదిబోమంటున్నారు.

రాష్ట్రానికి 375 కంపెనీల పోలీసు బలగాలు

- 453 కోట్ల విలువైన నగదు, వస్తువులు సీజ్
- పంపిణీకి సిద్ధం చేసిన 71 వేల ఫోన్లు సీజ్
- 362 కోడ్ ఉల్లంఘనల కేసులు నమోదు
- 10 కల్లా కొత్త ఓటు దరఖాస్తుల పరిశీలన పూర్తి
- 10 నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ
- 205 చెక్ పోస్టుల ఏర్పాటు
- మీడియాతో సీఈవో వికాస్‌రాజ్

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా మాట్లాడుతున్న ప్రధానాధికారి వికాస్‌రాజ్

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు ఇప్పటివరకు 362 కేసులు నమోదు చేసినట్టు ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.453 కోట్ల విలువైన నగదు, నగలు, వస్తువులను సీజ్ చేశామని, ఇందులో రూ.362 కోట్ల నగదు, 71 వేల ఫోన్లు ఉన్నాయని చెప్పారు. ఎన్నికల భద్రత కోసం 375 కంపెనీల కేంద్ర పోలీసు బలగాలను పంపించనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం సమాచార మిచ్